


**శ్రీ మహా గణపతయే నమః**

# పుష్కరాలు (12 నదుల చరిత్ర)

**- బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్**
ప్రవచన నిధి, త్రిభాషామహా సహస్రావధాని,

శ్రీ మద్భగవల్లీలా విలాసమైన జ్యోతిషచక్రము చాలా ప్రభావమైనది. జ్యోతిష చక్రంలో పన్నెండు రాశులు ఉన్నాయి. అవి 1) మేషము 2) వృషభము 3) మిధునము 4) కర్కాటకము 5) సింహము 6) కన్య 7) తుల 8) వృశ్చికము 9) ధనుస్సు 10) మకరము 11) కుంభం 12) మీనం. నవగ్రహములలో బలమైనగ్రహము గురుడు. ఈ గురుడు సంవత్సరమునకు ఒక సారి పైన చెప్పిన 12 రాశులలోకి, ఒక రాశి, నుండి మరియొక రాశిలోనికి మారినప్పుడల్లా, భారత దేశంలోని ఒక్కొక్క నదికి పుష్కరములు ఏర్పడతాయి. ఆ సమయంలో, ఆ నది సకల తీర్థాలను తనలో నింపుకొంటుంది. అందువల్లే పుష్కర కాలంలో నదులకు మహా మహిమలు కలుగుతాయి.

## పుష్కర ఉత్పత్తి:

పూర్వము పుష్కరుడు అను పేరు గల ఒక విప్రుడు బ్రహ్మ అనుగ్రహం కోసం కఠోర దీక్షతో తపస్సు చేశాడు. అతని తపస్సుకు లోకాలన్నీ వణికిపోయాయి. దేవతలంతా ఆ తపస్సు వల్ల పుట్టిన వేడికి తట్టుకోలేక, అతని తపస్సును నిలపమని బ్రహ్మను ప్రార్థించారు. అప్పుడు బ్రహ్మ పుష్కరుని దగ్గరకు వెళ్ళి, అతని తపస్సును ప్రశంసించి వరములు కోరుకోమన్నాడు. పుష్కరుడు బ్రహ్మను దర్శించి, స్తుతించి, ప్రతి సంవత్సరము ప్రజలు తన పేరు తలచుకొని, తనను దర్శించి, స్పర్శించి, తరించేలాగ తన కొక తీర్థ రూపాన్ని
ఇమ్మని బ్రహ్మను కోరుకున్నాడు. అప్పుడు బ్రహ్మ త్వరలో నీ కోరిక సిద్ధిస్తుందని చెప్పి, అతనిని ఒక తామర పూవుగా మార్చి తనతో పాటు తీసుకొని వెళ్ళినాడు. తామర పువ్వును, సంస్కృతంలో పుష్కర పుష్పము అంటారు. ఆ తరువాత కొంత కాలానికి బ్రహ్మ దేవుడు, భూలోకంలో యజ్ఞం చేయటానికి సంకల్పించి భూమికి వస్తూండగా, ఆయన కళ్ళకి ఒక దివ్యమైన అడవి కనిపించింది. ఆ సౌందర్యానికి ముగ్ధుడై, కొంత సేపు అక్కడ ఉండి, బ్రహ్మ హఠాత్తుగా తన చేతిలోని పుష్కర పుష్పాన్ని నేల మీదికి విసిరి

వేశాడు. అప్పుడు ఒక పెద్ద ధ్వని పుట్టింది. ఆ శబ్దానికి కంగారు పడిన దేవతలు బ్రహ్మ వద్దకు వచ్చి భూమి కంపించటానికి, భీకరశబ్దము పుట్టటానికి గల కారణాలు బ్రహ్మను అడిగారు. అప్పుడు బ్రహ్మ, దేవతలారా సకల లోక క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంతకు ముందు నేనొక పని చేశాను. అదేమిటో వినండి. వజ్రనాభుడు అనే రాక్షసుడొకడు పూర్వం నా గురించి తపస్సు చేశాడు. నేను వాడికి ప్రత్యక్షమై వరాలు కోరుకోమన్నాను, వాడు మరణంలేని వరాన్ని ప్రసాదించమని కోరుకున్నాడు. నేను అది కుదరదని, పుట్టిన ప్రతి వాడు గిట్టక తప్పదని, మరొక వరం కోరుకోమని చెప్పగా వాడు పూవుగా మార్చబడిన తపస్వి చేతిలో తప్ప మరొకరి వలన మరణం లేకుండా వరం కోరుకొన్నాడు. నేను వానికా వరాలు ఇచ్చాను. వర గర్వంతో వాడు ఎందరో పిల్లల్ని చంపి వేశాడు. ఇప్పుడు మిమ్మల్నందర్నీ చంపగోరి రహస్యంగా పాతాళం నుండి వస్తున్నాడు. అందుకనే వాడికిచ్చిన వరం ప్రకారంగా, ఇంతకు పూర్వమే పుష్కర పుష్పంగా మార్చిన నా
భక్తుడిని ఆ ప్రదేశంలోకి విసిరి వేశాను. వాడి శిరస్సు పగిలింది. భూమి కంపించింది. ఆ భీకర శబ్దమే మీరు విన్నారు. నేను ఆ తామర పువ్వును విసిరిన చోట ఒక తీర్థం పుట్టింది. ఆదే పుష్కరిణి అని పేరు కలిగిన నదీతీర్థము. ఇది సమస్త ప్రాణులకు అత్యంత పవిత్రము, పుణ్యప్రదము. ఈ తీర్థంలో సకల నదీనద జలాలను నేను ప్రవేశ పెడుతున్నాను. సంవత్సరమునకు ఒక సారి గురుడు ఒక్కొక్క రాశిలో
ప్రవేశించినప్పుడు ఈ జలాధి దేవత పుష్కరుడు ఆయా నదులలో ప్రవేశిస్తాడు. అతని పేరు మీదుగా ఆ ఏడాది ఆ నదులకు పుష్కరోత్సవాలు జరుగుతాయి. ఆ సమయంలో ఆ నదులలో, భక్తి శ్రద్ధలతో సంకల్పం చెప్పుకొని, స్నానం చేసి ఉపవాసాలు, దానాలు, యజ్ఞాలు, పురాణ శ్రవణాలు చేసే వారికి, ముక్కోటి తీర్థాలలో స్నానం చేసిన ఫలితం వస్తుంది. నాచే మొట్టమొదటిగా ఏర్పాటు చేయబడిన, ఈ పుష్కరిణీ నది
పుష్కరాలకు ఆది అవుతుంది. ఈ పుష్కరిణీ నది చుట్టూ ఉన్న అరణ్యం ప్రసిద్ధి కెక్కుతుంది. ఇక్కడకు వచ్చిన ఏ జాతి స్త్రీ, పురుషులైన బ్రహ్మజ్ఞానులౌతారు. బృహస్పతి ధనూరాశిలో ప్రవేశించినప్పుడు, ఈ పుష్కరిణీ నదికి పుష్కర మహిమ ఆరంభమౌతుంది. ఆ సంవత్సరాంతం వరకు ఆనదికి అమహిమ ఉంటుంది. ఆ తరువాత, గురుడు మరియొక రాశిలోకి మారగానే, ఆ నదికి పుష్కర మహిమ చెందుతుంది
అని బ్రహ్మ దేవతలకు వివరించాడు.

## 12 పుష్కరాలు : 12 నదులు:

1. గురుడు ధనుస్సులో ప్రవేశించినప్పుడు, పుష్కరిణి నదికి పుష్కరాలు ఆరంభమౌతాయి. ఈ నది రాజస్థాన్ లోని ఆజ్మీర్ నుంచి సుమారు 12 కి.మీ. దూరంలో ఉంది.
2. గురుడు మకర రాశిలోకి ప్రవేశించినప్పుడు, తుంగభద్రా నదికి పుష్కరాలు జరుగుతాయి. ఈ తుంగ భద్ర ఆంధ్రప్రదేశ్ కి చెందిన మంత్రాలయంలోను, కర్ణాటకకు దగ్గరలో హోస్పేట్ దగ్గర కనబడుతుంది.
3. గురుడు కుంభ రాశిలో ప్రవేశించినప్పుడు, సింధూనదికి పుష్కరాలు ఏర్పడతాయి. ప్రస్తుతం సింధునది పాకిస్తాన్ లో ఉంది.
4. గురుడు మీనరాశిలో ప్రవేశించినప్పుడు, ప్రాణహితా నదికి పుష్కరాలు మొదలౌతాయి. ఇది ఆంధ్రప్రదేశ్ లోని, బెల్లంపల్లి కాళేశ్వరాలకు దగ్గరగా ఉంది.

5. గురుడు మేష రాశిలో ప్రవేశించినప్పుడు, పరమ పవిత్రమైన గంగా పుష్కరాలు ఆరంభింప బడతాయి. గంగా పరీవాహక ప్రాంతం చాలా పెద్దదైనప్పటికీ, కాశి, హరిద్వార్, హృషీకేస్, మున్నగు ప్రదేశాలలో ముఖ్యంగా స్నానం చేస్తారు. )
6. గురుడు వృషభ రాశిలో ప్రవేశించినప్పుడు, నర్మదా నదముకు పుష్కరాలు ఆరంభమౌతాయి. నర్మదా నదము మధ్యప్రదేశ్ లోని ఓంకారేశ్వరం దగ్గర ముఖ్యంగా స్నానం చేస్తారు.
7. గురుడు మిధున రాశిలో ప్రవేశించినప్పుడు, సరస్వతీ నదికి పుష్కరాలు ఆరంభమౌతాయి. సరస్వతీ నది బదరీ దగ్గర 'మానా' అనే ప్రదేశంలో మాత్రమే మనకు సరియైన దర్శనమిస్తుంది. కనుక స్నానాలు అక్కడే చేయాలి.
8. గురుడు కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు యమునా నది పుష్కరాలు ఆరంభమౌతాయి. యమునా నది, మధుర బృందావనాది ప్రాంతాలలో స్నాన యోగ్యమై ప్రవహిస్తుంది.
9. గురుడు సింహరాశిలో ప్రవేశించినప్పుడు, గోదావరి నదికి పుష్కరాలు ప్రారంభమౌతాయి.
10.గురుడు కన్యారాశిలో ప్రవేశించగానే, కృష్ణా నది పుష్కరాలు ప్రారంభమౌతాయి.
11.గురుడు తులా రాశిలో ప్రవేశించగానే, కావేరి నదికి పుష్కరాలు ఆరంభమౌతాయి.
12.గురుడు వృశ్చికరాశిలో ప్రవేశించినప్పుడు, తామ్రపర్ణి (భీమరథి) కి పుష్కరాలు ఆరంభమౌతాయి. తమిళనాడులో ఉన్న బాణతీర్థమన్న ప్రదేశమున ఈ పుష్కరాలు ప్రధానము.

## 12 నదులు, వాటి పుట్టుక, పుష్కర విశేషాలు

### 1. పుష్కర నది:

దీనిని గురించి ముందుగానే వచ్చినది.

### 2. కృష్ణానది:

ఒకప్పుడు బ్రహ్మదేవుడు కలియుగంలోని మానవుల లక్షణాలను చూసి, గుర్తించి శ్రీమహావిష్ణువు దగ్గరకు వెళ్ళాడు. విష్ణువును స్తుతించి బ్రహ్మ ఆయనతో ఇలా అన్నాడు "నారాయణా! పరమాత్మా! నీకు నమస్కారము. కలియుగంలోని మానవులు అల్పాయుష్కులై ఉంటారు. తెలివితేటలు తక్కువగా ఉంటాయి. సోమరిపోతులై యుంటారు. అనారోగ్యం పాలై పోతుంటారు. సరియైన సంపదలు ఎవరి దగ్గరా ఉండవు. అటువంటి కలియుగాన, మానవులు తరించటానికి మార్గము చూపించమని ప్రార్థించగా విష్ణువు సమాధానము ఇవ్వక తన శరీరము నుండి నీలవర్ణము గల ఒక స్త్రీని సృష్టించాడు. ఆ తరువాత బ్రహ్మకు, అమెను చూపి ఈ స్త్రీ కలియుగంలో మానవులను తరింపచేసే ఒక మహా నది కాగలదు అని చెప్పాడు. ఆ స్త్రీ సౌందర్యాన్ని చూసి, ఆశ్చర్యపోయిన బ్రహ్మ, విష్ణువు సృష్టిలోని సౌందర్యాన్ని చూసి ఆ కృష్ణను తనకు పుత్రికగా ఇమ్మని కోరాడు. అప్పుడు విష్ణువు, బ్రహ్మకు కృష్ణను పుత్రికగా

ఇచ్చెను. ఆనాటి నుండి కృష్ణ బ్రహ్మ పుత్రిక అనే పేరు కూడా పొందింది. ఇది జరిగిన కొంతకాలానికి, భూలోకం పాపాత్ములతో నిండిపోయి, క్రూరులు, శుచిలేనివారు, భూమి మీద స్వైర్యవిహారం చేయటం మొదలుపెట్టారు. పాపులను సంహరించి, తిరిగి భూమి మీద ధర్మాలు నెలకొల్పటానికి వాసుదేవుడు సంకల్పించగా, బ్రహ్మ దగ్గర ఉన్న కృష్ణను పిలిపించాడు. తరువాత విష్ణువు దేవతలను పిలిపించి, ఈ కృష్ణ నాచే సృష్టింపబడి, బ్రహ్మ పుత్రికగా పెరిగింది. ఈమెను నదిగా మార్చి, భూలోకానికి పంపబోతున్నాను.
అయితే భూమి మీద ఈమెను తొలుత ఎక్కడికి చేర్చాలో మీరు చెప్పండి. అనగా దేవతలు విష్ణువుతో ఇలా అన్నారు. “స్వామీ నారాయణా! నీ భక్తుడైన సహ్యముని కఠోర దీక్షతో తపస్సు చేసి, ఆ ప్రభావంతో పర్వతంగా మారిపోయాడు. కృష్ణను భరించగలిగే శక్తి ఆయనకే ఉంది. ఈమెను మేము ఆ పుణ్యాత్ముని దగ్గర చేరుస్తాము అని చెప్పి ఆ కృష్ణను తీసికొని, వారు సహ్యముని వద్దకు వచ్చారు."ఓ మునీశ్వరా! విష్ణువు కోసం పర్వత రూపం ధరించి మహా తపస్సు చేస్తున్నావు. భూమిని పాపాత్ముల నుండి
ఉద్ధరించటానికి శ్రీ మహావిష్ణువు కృష్ణ అనబడే ఈ బాలికను సృష్టించాడు. ఎవ్వరేమి కోరిన ప్రసాదించే దివ్య స్వరూపిణి ఈ కృష్ణ అని చెప్పగా, సహ్యముని వారందరికీ నమస్కరించి, ఆ తరువాత ఇలా అన్నాడు. ఓ శ్రీమన్నారాయణా, దేవతలారా, వైకుంఠం చేరటానికి విష్ణు సన్నిధిలో శాశ్వత నివాస సౌఖ్యం పొందటానికి నేను ఈ తపస్సు చేస్తున్నాను. ఆ సమయంలో ఈ కృష్ణను నా దగ్గరకు తీసుకొని వచ్చారు. నా జన్మ
చరితార్ధమయింది, ఈమె నదిగా మారి నా పర్వతం మీద నుండి తూర్పు ముఖంగా ప్రవహించి, సాగరసంగమం చేసి, భూలోకంలోని మానవుల పాపాలు తొలగించాలని నా కోరిక. శ్రీ మహావిష్ణువు గూడా నా కొండ మీద కొలువుండాలని ప్రార్థిస్తున్నాను అన్నాడు. అప్పుడు వెంటనే కృష్ణ నదీమ తల్లియై నా అంశతో నీమీద నుంచి, తూర్పు ముఖంగా ప్రవహిస్తాను. నీవు తరిస్తావు తద్వారా ప్రజలు తరిస్తారు. తరువాత శ్రీ మహావిష్ణువు వరాలు ఇస్తూ ఇలా అన్నాడు. మునీశ్వరా కొండపై నా కోసం తపస్సు చేశావు. నీ తపస్సుకు మెచ్చి నీ కోరిక తీరుస్తున్నాను. నీ కొండపై శాశ్వతంగా కొలువు ఉంటాను అన్నాడు. అప్పుడు ఆ పర్వత స్వరూపుడు సహ్యముని (ఆయననే సహ్యాద్రి అంటారు.) కృష్ణను, విష్ణువును భక్తితో పూజించాడు. దేవతలు తమ తమ లోకాలకు వెళ్ళిపోయారు. శ్రీ మహావిష్ణువు ఇచ్చిన మాట ప్రకారం తెల్లని రావిచెట్టుగా మారి ఆ కొండపై నెలవు అయ్యాడు. కృష్ణ అనబడే శ్రీ కన్య గూడ, ఆ చెట్టు అడుగు నుండి పుట్టి
సహ్యాపర్వతం మీద నుండి, భూమి మీదకు ప్రవహించింది. కృష్ణానది ఈ విధంగా సహ్యాపర్వతం పై పుట్టి కృష్ణా జిల్లా లోని హంసల దీవి దగ్గర సముద్ర సంగమం చేస్తుంది. ఆ నదీ పరీవాహ ప్రాంతంలో ఎన్నెన్నో పవిత్ర తీర్థాలున్నాయి. విష్ణువు వల్ల జన్మించి, బ్రహ్మపుత్రికగా మారిన ఈ కృష్ణ, తన జలాల్లో స్నానం చేసిన వారికి, తన తీరంలో స్నాన, దానాలు చేసిన వారిని, సకల పాప విముక్తులను చేసి మహా పుణ్యులను
చేస్తుందని పురాణాలు చెబుతున్నాయి. గురుడు కన్యారాశిలో ప్రవేశించినప్పుడు, కృష్ణా నదికి పుష్కరాలు ప్రారంభమౌతాయి. మొదట 12 రోజులను అదిపుష్కరాలని, ఆ సంవత్సరం చివరి 12 రోజులను అంత్యపుష్కరాలని పిలుస్తారు. అన్నీ తీర్థాలను తనలో ఇముడ్చుకొన్న పుష్కర పురుషుడు, ఆ సంవత్సరమంతా కృష్ణా నదిలోనే ఉంటారు. జన్మత: పావనమైన ఈ నది పుష్కర కాలంలో చెప్పరానంత పవిత్ర మూర్తిగా మారుతుంది. పుష్కర

కాలంలో వేదోక్తంగా సంకల్పము చెప్పుకొని,స్నాన, దానాలు
చెయ్యాలి. అటువంటివారు శ్రీ కైవల్యపదాన్ని పొందుతారు.

## 3. గంగానది ఆవిర్భావం:

పర్వతాలలోకెల్లా గొప్ప పర్వతము హిమాలయము. హిమవంతుడు, మేరు పర్వత కుమార్తె అయిన మేనక (ఈమెకే మనోరమ అనే పేరు కూడా కలదు) ను వివాహమాడాడు. వారికి ఇద్దరు పుత్రికలు పుట్టారు. పెద్ద ఆమె గంగ. రెండవ కూతురే పార్వతీదేవి. ఆ ఇద్దరూ పెరుగుతూ ఉన్న సమయంలో దేవతలు తమ శ్రేయస్సు, లోక శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని, గంగనుమూడు దారుల గుండా అనగా స్వర్గము, భూలోకం,
పాతాళం ప్రవహించే ఒక నదిగా మార్చి, తమకు ఒక ప్రవాహమిచ్చి తమ పుణ్య, ధర్మ, కర్మలకుసాయం చేయమని కోరుకున్నారు. అప్పుడు హిమవంతుడు, గంగ మొదట విష్ణు పాదాల నుండి పుట్టిందని ఆ తరువాత తన తపస్సుకు మెచ్చుకొని విష్ణువు తనకు కూతురుగా ఇచ్చాడని, కాబట్టి ముందుగా విష్ణువు యొక్క అంగీకారం తీసుకోవాలని వారికి చెప్పాడు. దేవతలు విష్ణువును ప్రార్థించగా ఆమెను మందాకిని అనే
పేరుతో ఆకాశగంగగా మార్చి మొదట దేవలోకానికి పంపించాడు. గంగ భూలోకానికి వచ్చిన విధానము మూడు దారుల గుండా గంగ ప్రవహించాలని దేవతలు కోరారు. మొదటి దారి ఆకాశం, రెండవదారి అనగా భూలోకానికి వచ్చిన పైనం ఈ క్రింది విధంగా చెప్పారు.
పూర్వకాలంలో సూర్యవంశంలో సగరుడు అనే ఒక చక్రవర్తి జన్మించాడు. ఆయన తన అపార పరాక్రమంతో భూమండలాన్ని, ఏకఛత్రాధి పత్యంగా పరిపాలించాడు. అయోధ్యాధి పతి అయిన ఈ సగరుడికి కేశిని, సుమతి అనే ఇద్దరు భార్యలున్నారు. సంతానహీనుడై,ఆ రాజు భృగువు కోసం తపస్సు చేయగా భృగువు ఆయనకు రెండు వరాలు ఇచ్చాడు. ఒక భార్య వల్ల వంశంనిలిపే ఒక కొడుకు, మరో భార్య వల్ల అరవై వేల మంది పుడతారు. అప్పుడు కేశిని నాకు ఒక్క కొడుకు చాలు అన్నది. సుమతి అరవై వేల మంది కావాలని కోరుతుంది. వర ప్రభావం వల్ల కేశినికి అసమంజసుడు అనే కుమారుడు పుట్టాడు. సుమతికి అరవై వేలమంది కొడుకులు పుట్టారు. అసమంజసుడు అయోధ్యలోని పిల్లలను సరయూ నదిలో వేసి, వాళ్ళు తన్నుకొని చస్తూ ఉంటే నవ్వేవాడు. ఆగ్రహించిన సగరుడు, కొడుకును నగరం నుండి వెళ్ళగొట్టాడు. ఆ అసమంజసుని కొడుకు అంశుమంతుడు బుద్ధిమంతుడు. కొంతకాలానికి సగరునికి అశ్వమేధ యాగం చేయాలని కోరిక కలిగింది. యాగాశ్వాన్ని
ఇంద్రుడపహరించుకొని పోయి, పాతాళలోకంలో ఉన్న కపిల మహర్షి ఆశ్రమంలో కట్టి వేశాడు. గుఱ్ఱాన్ని వెతికి తీసికొని రమ్మనమని తన అరవై వేల మంది బలవంతులైన కొడుకుల్ని పంపగా వారు నేల పాతాళం వరకు త్రవ్వి, భూమిని ఛిన్నాభిన్నం చేశారు. చివరికి పాతాళానికి వెళ్ళి, కపిల మహర్షి ఆశ్రమంలో ఉన్న గుఱ్ఱాన్ని చూసి ఆయననే దొంగగా భావించి పాతాళవాసియైన ఆ కపిల మహర్షి జుట్టు పట్టుకొన్నారు. ఆ మహర్షి కళ్ళు విప్పగానే అందులో నుంచి అగ్ని జ్వాలలు వచ్చి వారంతా భస్మమైపోయినారు. తన కొడుకులు రాకపోవటం వల్ల సగరుడు మనువడైన అంశుమంతుని పంపాడు.
అంశుమంతుడు త్రవ్విన భూమి గుండా పాతాళమునకు వెళ్ళి తండ్రుల భస్మరాసులను చూచి జరిగినది గ్రహించి కపిలుని పూజించి గుఱ్ఱాన్ని తీసికొని తాతగారికి ఇచ్చాడు. మహర్షి

శాపానికి గురై దగ్ధమైన సగర పుత్రులు ప్రేతాలై అల్లాడుతున్నారని, వారి మీద ఆకాశగంగ ప్రవహిస్తే కాని వారికి సద్గతులు కలగవని గరుత్మంతుడు అంశుమంతునికి చెప్పాడు. అందువల్ల అంశుమంతుడు, గంగను భూమి మీదకు తెచ్చుట కొరకు హిమాలయాలకు వెళ్ళి ముందుగా బ్రహ్మ గురించి తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరమిచ్చేలోపే ఆయువు తీరి అతను మరణించాడు. అతని కుమారుడు దిలీపుడు గూడ ఈ ప్రయత్నంలోనే ప్రాణాలు విడిచిపెట్టాడు. ఆ దిలీపుని కొడుకు భగీరథుడు వేయి సంవత్సరాలు తపస్సు చేయగా బ్రహ్మ మెచ్చి గంగను అతనికి ఇచ్చాడు. అప్పుడు గంగ నేను భూమి మీదకు దిగి వస్తే నా వేగానికి భూమి ధ్వంసమై పోతుంది గాబట్టి నన్ను భరించగలిగే శివుని గురించి తపస్సు చేయమని కోరింది. భగీరథుడు శివుని గురించి ఒక సంవత్సరం తపస్సు చేశాడు. ఆ తపస్సుకి మెచ్చి, శివుడు గంగను తన శిరస్సున భరిస్తానని వరమిచ్చాడు. శివుని చూచిన గంగ ఈ శివుడా, నా వేగానికి తట్టుకొనేవాడు ఇతనిని పట్టుకొని పాతాళంలో పారేస్తాను అని భావించి మహా వేగంతో శివుని శిరస్సు మీదకు దూకింది. ఆమె అహంకారము కనిపెట్టిన శివుడు, అద్భుతమైన తన జడలలో గంగను బంధించి బయటకు రాకుండా అణచివేశాడు. గుహల వంటి ఆయన జటా జూటంలో సుడులు తిరుగుతూ, బయటకు రాలేక అనేక సంవత్సరాలు బాధపడింది. అది గ్రహించిన భగీరథుడు మరల శివుని గురించి తపస్సు చేయగా, కరుణించిన శివుడు తన జడల గుంపులో నుండి కొంచెం సందు కల్పించి, కొంచెంగా గంగను బిందు సరోవరంలో విడిచి పెట్టాడు. అక్కడి నుండి ఏడు పాయలుగా ఆ నది ప్రవహించింది. పావని, హ్లాదిని, నళిని అను మూడు పాయలు తూర్పు ముఖంగా ప్రవహించినాయి. సీత, సుచక్షువు, సింధు అను మూడు పాయలు పడమటి ముఖంగా ప్రవహించాయి. మిగిలిన ఏడవ పాయ, భగీరథుని వెంట ప్రయాణమై వచ్చినది. నిర్మల కాంతితో, జల జంతువులతో, ఆశ్చర్యకరమైన వేగంతో భగీరథుని వెంట ఆకాశం నుండి భూమికి, భూమి నుండి పాతాళమునకు ప్రవహించింది. ఈ గంగా జలం బహు పవిత్రమైనది. శివుని శిరస్సు మీద పడినది అని దేవ ఋషులు, దేవతలు భూమి మీద ఉండేవారు, ఆ జలాన్ని ఆచమనం చేశారు. ఇక్కడొక చమత్కారమున్నది. నిజానికి ఆకాశం నుండి భూమికి వచ్చింది. కానీ దేవతలు భూమి మీదకు వచ్చాకే ఆచమన స్నానాలు చేశారు. దానికి గల కారణం ఏమిటి? దానికి ఆపస్థంబ సూత్రం ఇలా చెప్తోంది. "భూమిగతాస్వప్సు ఆచమ్య ప్రయతో భవతి" అనగా నేల మీదకు వచ్చిన జలమునందు ఆచమించి పరిశుద్ధుడగును అని అర్థము. మను స్మృతిలో గూడ "ఆపశ్శుద్ధా భూమి గతా 5-128 శ్లో" అని ఉన్నది.

దీని ప్రకారము గూడ భూమి మీదకు వచ్చిన జలమే పవిత్రమైనది. అందువలననే ఋషులు, దేవతలు గంగ భూమి మీదకు వచ్చిన పిదప మాత్రమే స్నానం చేశారు. భగీరథుని వెనుక వెళుతున్న గంగలో దారి పొడుగునా ప్రజలు స్నానం చేసి, పాపాలు, తాపాలు తొలగించుకొన్నారు. మార్గ మధ్యంలో గంగ జహ్ను మహర్షి ఆశ్రమాన్ని ముంచివేసింది. ఆయన యాగ వస్తువులు గంగా ప్రవాహంలో కొట్టుకుపోయాయి. దానికి ఆగ్రహించిన ఆ ఋషి నిమిషంలో ఆ గంగను త్రాగేశాడు. ఋషులు, భగీరథుడు ఆయనను ప్రార్థించగా కరుణించి చెవులలో నుండి గంగను విడిచిపెట్టాడు. అప్పటి నుండి గంగకు జాహ్నవి అని పేరు వచ్చింది. చివరకు గంగ మరే అడ్డం లేక భగీరథుని వెంట సముద్రంలో ప్రవేశించి పాతాళంలో చేరి, సగర పుత్రుల భస్మరాశుల మీద ప్రవేశించి వారందరినీ పవిత్రులను చేసింది. అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై భగీరథ మహారాజా, సగర

పుత్రులు పిశాచత్వము వదిలి దేవతలై స్వర్గానికి పోయారు. వారు సముద్రంలో జలమున్నంత వరకూ స్వర్గంలో ఉంటారు. ఈ గంగా నీ పేరు మీదుగా భాగీరథి అని పిలువబడుతుంది. స్వర్గ, మర్త్య, పాతాళాలలో కూడా ప్రవహించిన కారణంగా గంగాకు త్రిపథ అనే పేరు కూడా వస్తుంది. నీ పట్టుదల వల్ల గంగ భూమికి వచ్చింది. నీ తాతలకు గంగా జలంతో తర్పణం చేసి, నీవు కూడా స్నానం చేసి, శుభము పొందు అని ఆశీర్వదించాడు. ఈ విధంగా గంగ భూలోకానికి దిగి వచ్చింది. ఈ కథ విన్నా,
చదివినా, వ్రాసినా ధనం, కీర్తి, ఆయుష్షు లభిస్తాయి. పుత్ర సంతానం లేని వారికి, పుత్ర సంతానం కలుగుతుంది. ఇది పితృదేవతలకు ప్రీతి కలిగిస్తుంది. స్వర్గాన్ని కలిగిస్తుంది. నాలుగు వర్ణాల వారికి సకల పాపాలు తొలగించి, కోరిన కోరికలను తీరుస్తుంది.
పుష్కర సమయంలో గంగా స్నానం అనంత ఫలితం ఇస్తుంది.

## 4. నర్మద:

పూర్వం చంద్ర వంశంలో పురూరవుడు అనే రాజు, సమస్త భూ మండలాన్ని ఇంద్రుని వలె తన పరాక్రమంతో పరిపాలించాడు. ఒకనాడాయన వృద్ధులు, పండితోత్తములైన బ్రాహ్మణులను సమావేశ పరచి, ఓ విప్రులారా యజ్ఞాలు వంటివి చేయకుండా కూడా స్వర్గలోకం వెళ్ళాలంటే ఏమి చేయాలో వివరించండి అని అడిగాడు. అప్పుడు ఆ విప్రులు, మహారాజా, స్వర్గలోకం లో నర్మద అని పేరు గల ఒక నది ఉంది. దానిని దర్శిస్తే చాలు, ఎవరైనా తరించి పోతారు. ఈ లోకంలోని పాపాలన్నింటిని నశింపజేసే శక్తి ఆ నది ఒక్కటికే ఉంది. దానిని మీరు ఏదో విధంగా భూమికి తీసికొని రండి. అరిషడ్వర్గాన్ని జయించిన ఆ మహాత్ములైన విప్రుల వాక్కులు పురూరవుణ్ణి ప్రోత్సాహపరిచాయి. ఆయన కంద మూలాలు స్వీకరిస్తూ, శివుని గూర్చి తపస్సు చేశాడు. శివుడు ఆ తపస్సుకు మెచ్చుకుని, ఏమి వరం కావాలో కోరుకో అనగా పురూరవ చక్రవర్తి సకల లోకహితం కోసం నర్మదా నదిని భూమి మీదకు పంపించమని ఆ నది లేని కారణంగా లక్ష యోజనాల
వైశాల్యం గల జంబూ ద్వీపము నిరాధారమై పోతోందని దేవతలు, పితృదేవతలు, మనుష్యులు తృప్తి పొందటం లేదని విన్నవించాడు. అప్పుడు మహాదేవుడు రాజా కోరరాని వస్తువు కోరుతున్నావు. ఈ వరం దేవతలకు కూడ దుర్లభమే. నర్మదను తప్ప మరేదైనా కోరుకో అన్నాడు. పురూరవుడు ప్రాణం పోయినా నాకు నర్మద తప్ప మరొకటి అక్కరలేదు. అని భీష్మించుకుని మళ్ళీ ఉగ్ర తపస్సు చేశాడు. చివరకు
మహాదేవుడు ప్రసన్నమై, నర్మదను పిలిచి ఓ దేవేశ్వరి, నీవు భూమి మీదకు దిగి పురూరవుని తపః ఫలితంగా మృత్యుముఖంలో ఉన్న మానవులను ఉద్ధరించి, స్వర్గ ప్రదానం చేయమని చెప్పాడు. అప్పుడు నర్మద "మహేశ్వరా, నన్ను భరించగలిగే ఆధారం లేకుండా స్వర్గము నుండి భూమి మీదకు దిగితే భూమి ధ్వంసమై పోదా?" అని ప్రశ్నించింది. నర్మద మాటలు విన్న శివుడు, కుల పర్వతాలను ఎనిమిదింటిని
పిలిపించి స్వర్గం నుండి భూమి మీదకు దిగే నర్మదను మీలో ఎవరు భరిస్తారు అని అడిగాడు. అప్పుడు వింధ్య పర్వతము లేచి ఓ మహేశ్వరా మీరు అనుగ్రహిస్తే నర్మదా నదిని పర్యంకుడు అనే పేరు కలిగిన నా కుమారుడు భరిస్తాడు అనగా శివుడు అందులకు అంగీకరించాడు. అప్పుడు పర్యంకం శివుని పూజించి నర్మదను భరించడానికి సంసిద్ధుడయ్యాడు. అప్పుడు నర్మద పర్యంక పర్వత శిఖరం మీదనుండి భూమి మీదకు

దూకింది. ఆ నదీ వేగానికి భూమండలం అంతా అల్లకల్లోలమయింది. అకాల జల ప్రళయమొచ్చింది. అప్పుడు దేవతలంతా కలసి మేఖల పుత్రిక అయిన నర్మదను ఇలా స్తుతించుచు. ఓ నదీ దేవి, నీవు అనంత శక్తివంతురాలవు. దయతో నిన్ను నీవే అదుపులో పెట్టుకో. ఒక సరిహద్దు పెట్టుకొని సక్రమంగా ప్రవహించి విశ్వానికి హితం చేయమని కోరగా నర్మద తన రూపాన్ని సంకుచితం చేసుకుని, పద్ధతి ప్రకారం ప్రవహించటం మొదలు పెట్టింది. ఆ క్షణం నుంచి నర్మద అద్భుతమైన తన వేగాన్ని లోక క్షేమం దృష్ట్యా తగ్గించుకొంది. తదనంతరం ఆ నదీ దేవత పురూరవునితో తన జలాన్ని స్పర్శించి పితృ తర్పణమిచ్చి తరించమని సలహా ఇచ్చింది. నర్మదా నది ఆజ్ఞ పరిపాలిస్తూ పురూరవుడు, ఆ నదీ జలాలను స్పర్శించి, ఆచమనం చేసి పితృదేవతలకు నువ్వులతో, నర్మదా జలాలతో తర్పణ చేశాడు. ఆ జల తర్పణం పొందిన పురూరవుని పితరులు, దేవతలకు కూడ దుర్లభమైన పరమపదాన్ని పొందారు. నర్మద రాకతో
జగత్తు అంతా అన్ని విధాల పవిత్రమయ్యింది. నర్మదా నదీ తీరంలో ఉన్న దేశాలు, పర్వతాలు, గ్రామాలు అన్నీ పరమ పవిత్రాలే. సరస్వతీ జలం మూడు రోజుల లో పవిత్రం చేస్తుంది. యమునా జలం ఏడు రోజుల లో పవిత్రం చేస్తుంది. గంగా జలం తనలో స్నానం చేసిన వాడిని పవిత్ర్యణ్ణి చేస్తుంది. కానీ నర్మద దర్శన మాత్రంతో మనిషిని పవిత్రం చేస్తుంది. నర్మదా సంగమంలో (ఈ సంగమము ఓంకార క్షేత్రం దగ్గర ఉంది)
స్నాన, దాన, జప, హోమ, వేదపాఠ, పితృపూజన, దేవతారాధన, మంత్రోపదేశ, సన్యాస దీక్ష, దేహ త్యాగాలు చెప్పలేనంత ఫలితాన్ని ఇస్తాయి. వైశాఖమాసంలోను, కార్తీక పూర్ణిమనాడు, విషువత్తుల కాలంలోను, సంక్రాంతి సమయాలలోను, వ్యతీపాత వైధృతి యోగాలలోను, అమావాస్యల లోను, తిథులు తగులు మిగులు కాలాలలోను, మన్వాది, యుగాది, కల్పాది తిథులలోను, తల్లి దండ్రులు పోయినప్పుడు, నర్మదా
నదీ తీరంలో ఉన్న ఓంకార క్షేత్రం దగ్గర, మరీ ముఖ్యంగా అక్కడే యున్న సంగమంలోను ఎవరు గోదానం చేస్తారో వారికి అశ్వమేధ యజ్ఞ ఫలితం లభిస్తుంది. ఈ పైన చెప్పిన కాలాలలో నర్మదలో దానం, స్నానం, హోమం, జపం, పూజనము మున్నగునవి చేసిన వారికి గూడ అశ్వమేధ యాగం చేసిన పుణ్య ఫలితం లభిస్తుంది. ఇంతెందుకు, నర్మదలో స్నానం చెయ్యటానికి వేసే ప్రతి అడుగడుక్కి అశ్వమేధ యాగం చేసిన
ఫలితం లభిస్తుంది. ఉదయమే లేచి, నర్మదా నదిని స్తుతి చేసిన వానికి ఏడు జన్మలలో చేసిన పాపం ఆ క్షణమే నశించి పోతుంది. నర్మదా సంగమంలో స్నానం చేసినవారికి, ఓంకారేశ్వర దర్శనము చేసిన వారికి, అశ్వమేధ యాగం చేసిన ఫలితం లభించడమే కాక అంత్య కాలంలో శివ లోకానికి కూడ వెళ్తారు.

## 5. సరస్వతి:

పూర్వము బ్రహ్మ దేవుడు పుష్కర పుష్పాన్ని భూలోకంలో విసిరి, పుష్కర తీర్థాన్ని, పుష్కర అరణ్యాన్ని సృష్టించిన విషయం పుష్కర కథ ప్రారంభంలో ఉదహరించాము. ఆ తరువాత బ్రహ్మ పుష్కరారణ్యంలో యజ్ఞం చేయాలని సంకల్పించాడు. దేవ, మానవ హితం కోసమే ఈ యజ్ఞం. విష్ణువు, శివుడు, దేవతలు సహకారం చేశారు. ఈ యజ్ఞానికి భృగువు హోత. పులస్త్యుడు ఆధ్వర్యుడు, మరీచి ఉద్గాత, నారదుడు బ్రహ్మ

సనకాదులు సదస్యులు దక్ష ప్రజాపతి మున్నగు వారు కూడా అక్కడ ఉన్నారు. తీరా యజ్ఞ సమయానికి బ్రహ్మ పత్ని  సావిత్రి రాలేదు. యజ్ఞానికి సమయం మించి పోతోందనే ఉద్దేశ్యంతో బ్రహ్మ మరియొక స్త్రీని తన భార్యగా తీసికొని రమ్మనమని ఇంద్రుని పురమాయించాడు. అప్పుడు ఇంద్రుడు ఒక గొల్ల పిల్లను తీసికొని వచ్చి బ్రహ్మకు యిచ్చి వివాహం చేశాడు. ఆమెయే గాయత్రి. గాయత్రితో కలిసిన బ్రహ్మ యజ్ఞం మొదలుపెట్టి కొనసాగించాడు. ఇలా నూరేళ్ళు యజ్ఞం సాగాక , అక్కడికి బ్రహ్మ అసలు భార్యలు సావిత్రి, సరస్వతి యజ్ఞానికి వచ్చారు. తీరా బ్రహ్మ ప్రక్కన మరియొక స్త్రీని చూచి బ్రహ్మకు దేవాలయాలలో పూజ ఉండదని, సంవత్సరానికి ఒకసారి కార్తిక పూజమాత్రమే ఉంటుందని శపించింది. ఈ విధంగా ఒక్క బ్రహ్మనే గాక సకల దేవతలను కూడ శపించింది. అప్పుడు శ్రీమహావిష్ణువు తన తియ్యని వాక్కులతో సావిత్రిని ప్రసన్నం చేశాడు. విష్ణుస్తుతికి సంతోషించిన సావిత్రి ఆగ్రహం తగ్గించుకొని బ్రహ్మను చేరి యజ్ఞంలో పాల్గొంది. ఆపై బ్రహ్మ తనను కూడ విడిచి, మరియొక స్త్రీని వివాహము చేసికొని యజ్ఞం చేస్తున్నాడని తలచుకొనిన సరస్వతిని శ్రీమహావిష్ణువు స్తుతించాడు. ఇక విష్ణుస్తుతికి సంతోషించిన సరస్వతి, విష్ణువును ఏదైనా వరం కోరుకోమంది. అప్పుడు సరస్వతిని, విష్ణువు పంచ ఉపనదులతో కూడిన నదిగా భూలోకంలో వెలసి, పాపులను పవిత్రులుగా చేయమని కోరాడు. వాగ్దేవి అందులకు అంగీకరించి సుప్రభా, కాంచన, ప్రాచి, నంద, విశాలక అనే ఐదు ఉపనదులతో కూడిన దివ్య నదిగా మారింది. ఈ నది బదరీ క్షేత్రం దగ్గర మానా అను ప్రదేశంలో ఆరంభమై, ఉత్తర భారత భూములను, పుణ్య భూములను చేసింది. బ్రహ్మ యజ్ఞం చూడటానికి వచ్చిన వికలాంగులు, గూనివారు సరస్వతిలో స్నానం చేసి, అవయవ లోపాలు పోగొట్టుకొని ఆరోగ్యవంతులైనారు. ఈ సరస్వతి సర్వ శ్రేష్ఠ తీర్థం. స్నానం చేసిన వారికి సకల శాస్త్ర జ్ఞానము ప్రకాశించే దివ్య నది. పుష్కరాలలో సరస్వతికి ఉన్న శక్తి ఏ నదికి లేదని పద్మ పురాణం చెప్తోంది. విష్ణు ప్రార్ధన పై బ్రహ్మ కొరకు ఉద్భవించింది. జ్ఞానుల సంతోషము కొరకు ఉద్భవించింది. మహాపుణ్యాన్ని ప్రసాదించేది ఈ నది. దీనికి ఐదు ప్రవాహాలు ఉన్నాయి. ఈ నదినే సుప్రభ అని కూడ పిలుస్తారు. ఈ సరస్వతీ నది  సత్రయాగం చేస్తున్న ఋషులు ధ్యానించిన వెంటనే వారి భక్తికి ప్రసన్నురాలై తూర్పు దిక్కున చేరింది. అందుకే ఈ నదిని ఋషులు "ప్రాచీనహ" అని పిలిచి నమస్కరిస్తారు. పూర్వం మంకనుడు అను ఒక విప్రుడు ఉండేవాడు. అతను గొప్ప తపస్సు చేశాడు. ఒకనాడు అతని చేతికి దర్భ తగిలి చీరుకుపోయి,

అందులో నుండి కూరగాయల రసం ప్రవహించింది. అది తన తపశ్శక్తిగా గ్రహించిన ఆ ఋషి తాండవ నృత్యం సంతోషంతో చేయటం మొదలు పెట్టాడు. దానితో జగత్తు అల్లకల్లోలమయింది. అతడంత శక్తివంతుడన్న మాట. దేవతలు ఆ ప్రళయమాపమని బ్రహ్మను ప్రార్థించగా బ్రహ్మ రుద్రుణ్ణి ప్రార్థించాడు. రుద్రుడు ఆ ముని దగ్గరకు వెళ్లి చేతినుండి శాకరసం కారితేనే ఇంతగా గంతులు వెయ్యాలా, అని తన చేతితో

బొటన వ్రేలు కొట్టుకుని అందులోనుండి భస్మాన్ని గుట్టలు గుట్టలుగా సృష్టించాడు. నేలమీద పోశాడు. అప్పుడు ఆ మంకనుడు అహంకారము విడిచి శివుని పాదములపై పడగా శివుడు సంతోషించి ఇలా అన్నాడు. సరస్వతీ నదీ తీరంలో తపస్సు చేయడం వలన నీకు యీ శక్తి వచ్చింది. నీవు ఈ నదీ తీరంలో తపస్సు కొనసాగించు, నా అనుగ్రహంతో నీ తపస్సు వెయ్యి రెట్లు వృద్ధి పొందుతుంది. నేను కూడ ఎప్పుడూ

ఇక్కడే ప్రాచీవాహిని అని పిలువబడే ఈ సరస్వతీ తీరంలో ఉంటాను. ఈ నది ఈ క్షేత్రం లో విశేషమైన ఫలితం ఇస్తుంది. ఈ సరస్వతి నది ఉత్తర తీరంలో శరీరము విడిచి పెట్టిన వాడు ఇహ పరాలలో ఏదైనా సాధించ గలడు. ఈ నదీ తీరంలో జపాలు చేసిన వాడు మరల మరణము పొందడు అనగా పునర్జన్మ పొందడు. పుష్కరాల సమయంలో ఈ నదిలో స్నానం చేస్తే అశ్వమేధ యాగ పుణ్యం వస్తుంది. ఇక్కడ తిల తర్పణాలు
చేసిన వారు, నియమంగా ఉపవాసాలు, సువర్ణము వంటి పవిత్ర దానాలు చేసిన వారు పవిత్ర శరీరాన్ని పొంది పరబ్రహ్మాన్ని పొందుతారు. సరస్వతీ నదికి ప్రాచీనత్వము లభించిన అద్భుతమైన కథ పద్మ పురాణంలో 18వ అధ్యాయంలో ఉంది. ఒకప్పుడు దేవలోకంలో బడబాగ్ని అనే పేరుతో ఒక భయంకరమైన అగ్ని ఉండేది. ఆ అగ్ని తేజస్సుకు దేవతలు అల్లాడిపోయి, సరస్వతిని పిలిచి ఓ సరస్వతీ, ఈ బడబాగ్ని తీసికొని పోయి సముద్రము లో వేసెయ్యి. దేవతలకు కూడ ఈ భయం తొలగుతుంది. లేకపోతే బడబాగ్ని తన తేజస్సుతో మమ్మల్ని దహించి వేస్తుంది. నీవు బ్రహ్మ పుత్రికవు. మాకు తల్లి వలె అభయమిచ్చి కాపాడు, అనగా సరస్వతీ నది, దేవతలారా బ్రహ్మదేవుడు ఆయన భార్య సరస్వతీ, నదిని అయిన నన్ను సృష్టించినారు. తండ్రి ఆజ్ఞ లేనిదే నేను ఏమీ చేయరాదు. నేను కుమారిని కనుక బ్రహ్మ దేవుడినిప్రార్థించండి. అప్పుడు దేవతలు బ్రహ్మను ప్రార్థించగా సరస్వతీ నదికి అనుజ్ఞ ఇచ్చాడు. తల్లి దండ్రులను విడిచి సముద్రానికి పోతున్నానని దుఃఖించగా బ్రహ్మ కార్యము చేసి నీకు అన్నీ సుఖాలే కలుగుతాయని దుఃఖించ వద్దని చెప్పగా సరస్వతి అందుకు అంగీకరించింది. దేవతలు సరస్వతీ ప్రయాణ సమయంలో శంఖాలు పూరించారు, డప్పులు మ్రోగించారు. మంగళధ్వనులు చేశారు. అప్పుడు సరస్వతి తెల్లని వస్త్రము, తెల్లని చందనము ధరించి చల్లని తేజస్సుతోప్రయాణమయ్యింది. గంగా యమునలు స్వయంగా వచ్చి సరస్వతిని సాగనంపారు. అప్పుడు సరస్వతి దేవలోకం నుండి ఉత్తర మహర్షి ఆశ్రమం చేరి ఒక జువ్వి చెట్టు క్రింద తన శరీరమును విడిచి నదిగా ఆవరించింది. ఆ జువ్వి చెట్టు విష్ణు స్వరూపం. ఇప్పటికి గూడ ఆ జువ్వి చెట్టును భక్తితో సేవిస్తారు. తదనంతరము శ్రీ మహావిష్ణువు బడబాగ్నిని సరస్వతి నదిలో పారవేయగా సరస్వతి ఆ అగ్ని ని తీసికొని సముద్రములో విడిచి పెట్టింది. బడబాగ్నిని మోసిన కారణం చేత సరస్వతీ నది అంతర్వాహినియై భూమి మీద ఎక్కువ మేర జల ప్రవాహము లేకుండా వెళ్లి పోయింది. ఆ క్షణం నుంచి బ్రహ్మాది దేవతలు మహా పాప నాశినిగా పేర్కొన్నారు. మనస్పూర్తిగా స్నానము చేసిన వాడు
బ్రహ్మ లోకానికి వెళ్తాడు. సరస్వతీ నది తీరమున వస్త్ర దానం చేసిన వాడు శివునికి వస్త్ర దానం చేసిన ఫలితం పొందుతాడు. పుష్కర కాలంలో, ఇక్కడి స్నానం అనంతరం ధనం విప్రుడుకి ఇచ్చిన వాడు అనంత ఫలితం పొందుతాడు. అన్ని తీర్థాలలోకి ఉత్తమం సరస్వతీ తీర్థం..

## 6.గోదావరి:

పూర్వం నిరంతర గాయత్రీ జప తత్పరుడైన గౌతముడు అనే మహర్షి దక్షిణ గోదావరీ తీరంలో కఠోర దీక్షతో తపస్సు చేశాడు. ఆ కాలంలో అనుకోకుండా భయంకరమైన క్షామము ఏర్పడింది. మానవులంతా తిండి లేక అల్లాడి పోయారు. ఒక్క గౌతమ మహర్షి ఆశ్రమం మాత్రము ఆయన తపశ్శక్తి వల్ల కళ కళలాడుతుండేది. క్షామానికి తట్టుకోలేని ప్రజలంతా

ఎక్కడెక్కడి నుంచో ఆయన ఆశ్రమానికి చేరారు. ఆ పుణ్యాత్ముడు వచ్చిన వారిని ఆదరించి ఆహారాన్ని సంతృప్తిగా అందించాడు. ఉదయం ఆశ్రమ ప్రాంగణంలోని పొలంలో కొంత ధాన్యం చల్లితే, మధ్యాహ్నానికి అది పెరిగి ఆశ్రమంలో ఉన్న వాళ్ళందరికీ, సరిపడినంత ధాన్యాన్ని పంట రూపంలో అందించేది. ఆ పంటతో ఆశ్రితులను సంతృప్తి పరచేవాడు గౌతముడు. ఇలా కొంతకాలము జరిగే సరికి గౌతముని మహిమ, దాతృత్వము జగత్తులో ప్రసిద్ధికెక్కాయి. చివరికి స్వర్గలోకంలో కూడ నారదుడు ఇంద్రునితో గౌతముని వంటి మహాత్ముడు లేడు అన్నాడు. ఇది సాటి విప్రులకు ఆగ్రహము కలిగించింది. తిండి లేక గౌతముని పంచకు చేరుకున్న కొందరు కృతఘ్నులు తమకు ఆయన చేసిన మేలు మరచి ఆయన కీర్తికి ఈర్ష్య పడి ఆయనను అప్రతిష్ఠ పాలు చేయాలనుకున్నారు. వారంతా చదువుకున్న వారే. కాని వారి తాత్కాలిక అజ్ఞానం వారి విజ్ఞానాన్ని కప్పి వేసింది. వారంతా కలిసి ఒక కృత్రిమమైన గోవును తయారు చేసి గౌతముని ఆశ్రమ ప్రాంతంలో వదిలారు. ఆ గోవు ఉఫ్ అంటే చచ్చే స్థితిలో ఉంది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన గౌతముడు పంట పాడై పోతుంది అనే ఉద్దేశ్యంతో ఆ గోవు పై ఒక దర్భ విసిరాడు. ఆ తాకునకే ఆ గోవు మరణించింది. అందుకే కాచుకొని కూర్చున్న విప్రులు గౌతముడు గోహత్యా పాపం చేశాడని గొడవ చేశారు. గౌతముడు ఖిన్నుడై దీనికి ప్రాయశ్చిత్తము ఏమిటని వారిని అడిగాడు. వారు గంగని దక్షిణ భారతానికి తీసికొని వచ్చి గోవు చచ్చిన చోట గంగ ప్రవహించేలా చేస్తే పాపం పరిహారమౌతుంది అని చెప్పారు. వారిలో కొందరి ఉద్దేశ్యం నది ఏర్పడితే కరవు నివారణ అవుతుందని, ఇంత పని గౌతముడు ఒక్కడే చేయగలడని నమ్మకం. అప్పుడు గౌతముడు శివుని గురించి కఠోర తపస్సు చేశాడు. శివుడు ఆ తపస్సుకు మెచ్చుకుని, ఏ గంగ ఉత్తర భారతంలో భాగీరథి అని ప్రసిద్ధి చెందిందో ఆ గంగను ఏడు ప్రవాహాలతో తన జటాజూటం నుండి భూమికి వదిలాడు. దానినే త్రయంబకము అంటారు. గోదావరి పుట్టిన ప్రదేశం నాసిక్ అని గూడ పిలువబడుతుంది. నాసిక అనగా ముక్కు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు ఇక్కడే కోశాడట. అందుకే దానికి నాసిక్ అనే పేరు వచ్చింది. ఇది మహారాష్ట్రలో ఉంది. ఇక్కడి నుండి గౌతముని వెంట ప్రవహించిన గోదావరి దారిలో ఎన్నో క్షేత్రాలను చుట్టబెడుతూ కొవ్వూరు దగ్గర గోవు చచ్చిన ప్రదేశం నుండి ప్రవహించింది. అదే ఈ నాటి గోష్పాద క్షేత్రము. ఈ నాటికీ కొవ్వూరులో యీ క్షేత్రం ఉంది. గౌతముని పేరు మీదుగా యీ నది గౌతమి గోదావరి అని పిలువ పడుతోంది. ఇది ధవళేశ్వరం దాటాక ఏడు పాయలై, వశిష్ట, వృద్ధ మున్నగు పేర్లతో సముద్రములో కలుస్తుంది. స్కాంద పురాణంలో గోదావరి గురించి ఎన్నో విషయాలు ప్రచారంలో ఉన్నాయి. శ్రీరామచంద్రుడు త్రేతాయుగంలో గోదావరీ తీరంలో నివసించాడు. పుష్కర కాలంలో గోదావరీ స్నానము అనంత ఫలితాన్ని ఇస్తుంది. సౌర సంహితలో యీ క్రింది శ్లోకం ఉంది.

శ్లో|| గోదావర్యాం సక్నత్ స్నానం, సింహయుక్తే బృహస్పతే
గంగాయాం ద్వాదశాబ్దస్య, నిత్య స్నానం ఫలం లభేత్ ||

అనగా పుష్కర సమయంలో గోదావరి నది లో ఒక్కసారి స్నానము చేస్తే వచ్చే పుణ్యం, గంగానదిలో 12 సంవత్సరాలు నిత్యము స్నానము చేసిన ఫలితం తో సమానం.

శ్లో|| జన్మ ప్రభృతి యత్పాపం స్త్రియావా పురుషేణవా
పుష్కరే స్నాన మాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి ||

పుట్టినప్పటి నుండి చేసిన సకల పాపాలు పుష్కర కాలంలో నదీ స్నానం చేస్తే తొలగి పోతాయి అని పుష్కర కల్పంలో చెప్పబడి ఉంది.

## 7.యమున:

యమునానది గోలోకంలో ప్రవహించే దివ్య నది. గోలోకం రాధాకృష్ణుల నివాస స్థానం. ఒకప్పుడు బ్రహ్మ భూలోక వాసుల పాప ప్రక్షాళణ కొరకు, సౌభాగ్యానికి గోలోక నివాసి అయిన యమునా నదిని భూలోకానికి పంపించ వలసిందిగా కృష్ణుని ప్రార్ధించాడు. అప్పుడు శ్రీహరి యమునా నదిని భూలోకానికి పొమ్మని ఆజ్ఞాపించాడు. శ్రీ కృష్ణుని ఆజ్ఞ ప్రకారం భూలోకానికి ప్రయాణమైన యమున స్వామి చుట్టూ ప్రదక్షిణ చేసింది. ఆ సమయంలో వైకుంఠం లోని విరజానది, శివుని జటాజూటం లోని గంగానది యమునలో కలిసిపోయాయి. ఆ క్షణం నుంచి యమున అపూర్వ ప్రభావం కలిగినది అయ్యింది. మహా వేగంగా గోలోకం నుంచి బయలుదేరి దారిలోని బ్రహ్మాండాలను ఛేదించుకొని యమున ముందుగా ధృవమండలంలోను, వైకుంఠంలో, బ్రహ్మలోకం లోను ఆపైన మేరు పర్వతము పైకి చేరింది. తన తీవ్ర వేగంతో మేరు పర్వతములోని శిఖరాలను, బండరాళ్ళను ఛేదించుకుంటూ దక్షిణ దిక్కుకు ప్రయాణమయ్యింది. ఆ సమయంలోనే గంగా యమునలు వేరైనాయి. గంగ హిమవత్ పర్వతం నుండి సువర్ణ వర్ణంతో ప్రవహించగా యమున నల్లని రంగుతో ప్రవహిస్తూ కళింద శిఖరం మీదకు చేరింది. కళింద శిఖరం మీద నుండి ప్రవహించిన కారణంగా కాళింది అని పిలువబడింది. అక్కడి నుండి వేగంగా, గంభీరంగా ప్రవహిస్తూ ఖాండవ వనం చేరింది. అక్కడే పాండవులు తదనంతరం ఇంద్రప్రస్థ పట్టణము నిర్మించారు. ప్రస్తుతం దానినే ఢిల్లీ అంటున్నారు. భూమి మీదకు వచ్చిన యమునకు శ్రీకృష్ణుని వివాహం చేసుకోవాలని కోరిక కలిగింది. తనలోని కొంత తేజస్సును సూర్యునిలో లీనం చేసింది యమున. సూర్యునికి మొదటి భార్య సంజ్ఞాదేవి. ఆమె వల్ల సూర్యునికి మొదటగా వైవస్వత మనువు, ఆ తరువాత యమధర్మరాజు పుట్టారు. సూర్యునిలో లీనం అయిన తేజస్సుతో సంజ్ఞాదేవి మూడవ మారు గర్భము ధరించి కూతురిని కన్నది. ఆమెయే యమునా నదీ తేజస్సుతో పుట్టిన బాలిక. ఆమెకు యమున అనే పేరు కాకుండా కాళింది అనే పేరును సూర్యుడు పెట్టాడు. ఎన్నెన్నో రూపాలతో ఉండగలిగే యమున ఒక ప్రక్క భూలోకంలో నదిగా ప్రవహిస్తూనే మరొక ప్రక్క సూర్య పుత్రికగా కూడ అవతరించింది. ఆవిడ చాలా కాలం ఖాండవ వనం దగ్గర తపస్సు చేసింది. యమున తండ్రి సూర్యుడు. ఆమె కోసం నది మధ్యలో ఒక గృహాన్ని కూడ నిర్మించి ఇచ్చాడు. ఆ గృహంలో ఉంటూ ఉన్నప్పుడు, ఒకనాడు శ్రీకృష్ణ పరమాత్మ ద్వాపర యుగంలో అర్జునుడితో కలిసి అటుగా వేటకు వచ్చి ఆమె వివరాలు తెలుసుకుని, ఆమెను వివాహము చేసుకున్నాడు. శ్రీకృష్ణుని అష్ట మహిషులలో కాళింది గూడ ఒకతే. ఇక అక్కడ యమున వేగంగా ప్రవహించి మధుర, బృందావనాల గుండా వెళ్ళి ప్రయాగ దగ్గర గంగా సంగమం

చేసింది. బృందావనంలో ప్రవహిస్తున్నప్పుడు, ద్వాపరయుగంలో
శ్రీకృష్ణుడు గోపికలతో జలక్రీడలు ఆడినప్పుడు యమున గూడ విశాఖ అనే చెలికత్తెగా మారి, ఆయనతో నృత్యం చేసింది. ఇంతటి ఈ నది గంగలో కలిశాక తన అస్తిత్వాన్ని కోల్పోయి, గంగగానే పిలువబడుతూ గంగకు ఉపనదిగా సముద్రములో కలిసిపోయింది. యమునానది గంగానదిలో కలిసే సమయంలో, ఆ అపూర్వ దృశ్యానికి పులకించి దేవతలు పుష్ప వర్షం కురిపించి స్తుతించారు. యమున తన ప్రాణ
స్నేహితురాలు గంగను చూసి గద్గద స్వరంతో ఇలా అన్నది. "ఓ గంగామాత, సమస్త లోకాలను పవిత్రం చేసే తల్లివి, నీవు ధన్యురాలవు. విష్ణు పాదాల నుండి పుట్టిన కారణాల వల్ల లోకమంతా నిన్ను పూజించి తీరాలి. నీవంటి దివ్య తీర్థం లేదు. నీవు సకల తీర్థ స్వరూపిణివి. ఇంతకు ముందు ఎప్పుడైనా తెలిసిగాని తెలియకగాని అపచారము చేసి ఉంటే నన్ను క్షమింపు". అప్పుడు గంగ ఇలా అన్నది "ఓ యమునానది, నీవు మాత్రము సామాన్యురాలివా, నీ స్పర్శ తో భువనాలన్నీ పరమ పవిత్రమౌతాయి. శ్రీకృష్ణుని ఎడమ భాగము నుండి పుట్టావు. అందువలన పరమానంద స్వరూపిణివి. పరిపూర్ణురాలివి. సాక్షాత్తు శ్రీకృష్ణుని పట్టపు రాణివి. ఏ విధంగా చూచిన నీవు సర్వోత్కృష్టురాలివి. గోలోకంలో అయితే నీ దర్శనమే దుష్కరము. ఎప్పుడైనా తెలియక అపచారము చేస్తే నన్ను కూడా క్షమించు". ఈ రకంగా రెండు నదులు ఒకదానికొకటి ప్రణామం చేసుకుని కలిసి ప్రవహించాయి. అక్కడి నుండి పాతాళానికి వెళ్లి భోగవతి అనే పేరుతో ఆ నదీ సంగమం ప్రసిద్ధి పొందింది. ఆ జలాన్ని ఆదిశేషుడు శిరస్సు మీద ధరిస్తాడు. పుష్కర కాలంలో యమునా నదిలో స్నానం అనంత పుణ్యం ఇస్తుంది. యమునా నదీ
తీరంలో చేసే భూదాన, గోదాన, వస్త్ర దానాలు శాశ్వతముగా గోలోక సుఖాలను అందిస్తాయి. యమునా కవచం గర్గ భాగవతంలో ఉంది. దానిని యమునా నదీ తీరంలో చదివితే శ్రీకృష్ణుని సన్నిధి లభిస్తుంది. ఆ గర్గ సంహితలోనే యమునా సహస్ర నామాలు కూడా ఉన్నాయి. అవి పుష్కర కాలంలో చదివితే వచ్చే ఫలితం
ఆదిశేషుడు కూడా వర్ణించలేడు.

## 8.కావేరి

కావేరీ నది చంద్ర తీర్థం నుండి పుట్టినట్లుగా కూర్మపురాణం ఉత్తర భాగంలో ఉన్నది. ఇది కర్ణాటక ప్రాంతంలో కూర్గు వద్ద బ్రహ్మగిరి పర్వతము నుండి పుడుతుంది. ఈ నది అగ్నిహోత్రుని భార్య. అగ్నిహోత్రునికి పదహారు మంది భార్యలు ఉన్నారు. అందులో ఈ కావేరి ఒకటి. పూర్వము కవేరుడు అనే ఋషి బ్రహ్మగిరి పర్వతముపై తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చిన బ్రహ్మ ఏ వరం కావాలో కోరుకోమనగా సంధ్యా వందనాది కార్యక్రమాలకి జలము లేక తరచూ తాను ఇబ్బంది పొందుతున్నాను కనుక బ్రహ్మదేవుని కమండలంలో ఉన్న గంగను కొంత తన కమండలంలో పోయమని కోరాడు. బ్రహ్మ అందుకు అంగీకరించి గంగా జలంతో కవేరుని కమండలం నింపాడు. ఆ జలం అక్షయంగా తన కమండలంలో ఉంటుందని ఎప్పుడైనా కాలితో తన కమండలాన్ని తన్నితే అది నదీ రూపాన్ని పొందుతుందని, ఇక ఎప్పుడూ తన కమండలంలో అక్షయ జలం ఉండదని చెప్పాడు. ఆ ఋషి సంతోషంగా కమండలాన్ని తన దగ్గర దాచుకుని

జపతపాదులు చేసుకున్నాడు. ఆయన ఆశ్రమం కర్ణాటక లోని కూర్గు జిల్లాలోని బ్రహ్మగిరి పర్వతము మీద ఉండేది. ఇలా ఉండగా కొంత కాలానికి భూమండలంలో దక్షిణ భారతంలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితి ఏర్పడింది. అప్పుడు ప్రజలంతా నీటి కోసం అల్లాడి కవేరుడి కమండల జలాన్ని భూమి మీద ఒలికించమని కోరారు. కావలసిన జలం మీకు ఇస్తాను కాని, భూమి మీదకు ప్రవహించనీయనని ఆ ఋషి భీష్మించుకొని,
ఆశ్రమాన్ని సహ్య పర్వతానికి మార్చి వేశాడు. అప్పుడు ప్రజలంతా విఘ్నేశ్వరుని ప్రార్ధించారు. విఘ్నేశ్వరుడు ఒక చమత్కారం చేశాడు. ఒకనాడు సంధ్యా సమయంలో కమండలాన్ని ఎదురుగా పెట్టుకుని అర్ఘ్యప్రదానం చేస్తున్న ఋషిని ఎవరో పిలిచినట్లు అయ్యింది. అది గణపతి మాయ అని తెలియక, తొందరలో బయటికి వెళ్లడానికి ఆ ఋషి లేచాడు. వెంటనే ఆయన కాలు కమండలానికి తగిలింది. కమండల జలం
నదియై ప్రవహించింది. కవేరుని పేరు మీదుగా ఆ నది కావేరి అని పిలువబడింది. ప్రజలకు ఆనందం కలిగింది. ఋషి దుఃఖిస్తూ ఉండగా, విఘ్నేశ్వరుడు ప్రత్యక్షమై అతని ధర్మమా అని ప్రజలు జల క్షామము లేక సుఖిస్తున్నారని ఆ నదీ తీరంలో తపస్సు చేసి తరించమని అతని కీర్తి శాశ్వతమౌతుందని చెప్పి అతనిని ఓదార్చాడు. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో అత్యంత పవిత్రములైన శ్రీరంగ పట్టణము, నరశీపురము, తిరుముకుళము, శివ సముద్రము వంటి ఎన్నో క్షేత్రాలు ఉన్నాయి. ఈ నది పశ్చిమ తీరంలో
తిరుచునాపల్లి ఉన్నది. రావణుని తమ్ముడు త్రిశిరుడు అనేవాడు ఈ నగరాన్ని పాలించాడు. త్రిశిరుడు అంటే మూడు తలలు కలవాడు అని అర్థం. అందువల్ల తిరుచునాపల్లి అయ్యింది. శ్రీరంగం దగ్గర కావేరి రెండు  పాయలయ్యింది. ఆ మధ్యలో ఆదిరంగము, మధ్యరంగము, అంతరంగము అను మూడు ద్వీపాలు
ఏర్పడ్డాయి. అందులో అంతరంగమునే శ్రీరంగం అంటారు. ఇక్కడ శ్రీమన్నారాయణుడు శేషశాయిగా దర్శనం ఇస్తాడు. ఇది వైష్ణవులకు సర్వోత్తమ క్షేత్రము. ఈ నది కోలిడమ్ దగ్గర బంగాళాఖాతంలో కలుస్తుంది. మైసూరుగా పిలువబడే మహిషాపురం దగ్గర శ్రీరంగ పట్టణం అనే మరో పవిత్ర క్షేత్రమున్నది. ఇక్కడ కూడా శ్రీమన్నారాయణుడు శేషసాయిగా దర్శనమిస్తాడు. ఇక్కడకు దగ్గరే సంగం అనే ప్రదేశం దగ్గర కావేరి కపిల అనే నదితో సంగమం అవుతుంది. పుష్కర సమయాలలో కావేరి దర్శనము అశ్వమేధ యాగ ఫలితం ఇస్తుందని, స్నానం స్వర్గాన్ని ప్రసాదిస్తుందని పురాణాలు చెప్తున్నాయి.

## 9.ప్రాణహిత లేక ప్రణీతా నది:

ఈ నది వింధ్య పర్వతము నుండి పుట్టి దక్షిణంగా ప్రవహించి, గోదావరిలో కలిసి ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ నుపవిత్రం చేసే దివ్య నది. సృష్టి ఆరంభ కాలంలో ఒకప్పుడు బ్రహ్మదేవుడు గొప్ప యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞం చూడటానికి విష్ణువు, శివుడు, ఇంద్రాది దేవతలు, దేవర్షులు, మహర్షులు వేంచేశారు. ఆ యజ్ఞం వేయి సంవత్సరాలు కొనసాగింది. ఆ సమయంలో జంబూ ద్వీపంలోని ప్రజలు బ్రహ్మదేవుని దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు. దక్షిణ ప్రాంతంలో జనపదాలు నీరు లేక అల్లాడి పోతున్నాయని, జలాన్ని ప్రసాదించమని వారంతా బ్రహ్మను వేడుకున్నారు. యజ్ఞ దీక్షలో ఉన్న బ్రహ్మ, మధ్యలో దీక్షా భంగం చేసినందుకు ఆగ్రహించినా, ప్రజల కష్టాలకు జాలిపడి తన దగ్గర ఉన్న ప్రణీత పాత్ర, అనగా యజ్ఞ పాత్ర నుండి జలాన్ని

సృష్టించి నేల మీదకు వదిలాడు. అది నదిగా మారింది. ప్రణీత పాత్ర నుండి పుట్టడం వలన ఆ నదికి ప్రణీత అని, ప్రాణుల హితం కోసం బ్రహ్మ సృష్టించడం వల్ల ప్రాణహిత అని పిలువబడింది. ఇది దక్షిణం వైపు ప్రవహించి, ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో వేములవాడ దగ్గర ఉన్న కాళేశ్వరం మీదుగా ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. ఈ నదీ తీరంలో మేఘుం కరం అనే తీర్థం ఉన్నట్లుగా మత్స్య పురాణం వల్ల తెలుస్తోంది. ఈ నది ఒడ్డున వినాయకుడు స్వయంభూ అయి వెలిశాడు. ఈ నదిలో స్నానం చేసి వినాయకుని దర్శనం చేస్తే సకల విఘ్నాలు తొలగి కార్యక్రమంలో దిగ్విజయం కలుగుతుంది. ఈ నదీ తీరంలో ఎన్నో దివ్య క్షేత్రాలు ఉన్నాయి. శ్రీ మహావిష్ణువు శారంగం అనే విల్లు ధరించి ఈ నదీ తీరంలో వెలిశాడు. ప్రాణహితా నది పార్వతీ దేవికి కూడా ప్రాణమట. ఒకప్పుడు ఈ నది ప్రార్థించగా అమ్మవారు వింగళేశ్వరి అనే పేరుతో ఈ నదీ తీరంలో వెలిసింది. వరుసగా ఒక సంవత్సరము ఈ నదీ జలం తాగిన వారికి దీర్ఘ రోగాలు తొలగి ఆధ్యాత్మిక జ్ఞానం అబ్బుతుందని పురాణాలు చెప్తున్నాయి. నల దమయంతులు అరణ్యవాసానికి వెళ్ళినప్పుడు ఈ నదీ తీరంలో ఉన్నట్లు, ఈ నదిలో స్నానం చేసినట్లు భారతం చెబుతోంది. ఈ నదీ తీరంలో వరాహ తీర్థం ఉంది. ఈ తీరంలోనే నృగుడు అనే మహారాజు గొప్ప యజ్ఞం చేసి బ్రాహ్మణోత్తములకు గోదానం చేశాడు. ఈ నదీ తీరంలో గోదానం, భూదానం, సువర్ణ దానం చేస్తే శాశ్వత స్వర్గలోక సుఖాలు లభిస్తాయని పురాణాలు చెప్తున్నాయి. నృగుడు ఈ దానాలన్నీ చేశాడు. ఈ మహారాజు చేసిన యజ్ఞాలలో సోమపానం చేయడానికి ఇంద్రుడు స్వయంగా దిగి వచ్చాడు. కారణము సోమపానంతో పాటు ప్రణీతా దర్శనము కూడా అవుతుందని. ఇంద్రునికి ఈ నది అంటే ఎంత ఇష్టమో తెలియజేసే మరొక కథగూడ పురాణాలలో ఉంది. గయుడు అనే మహారాజు సకల సుఖాలు కోరి ఇంద్రుణ్ణి ప్రార్థించాడు. అప్పుడు ఇంద్రుడు ప్రణీతా నదీ తీరంలో ఏడు అశ్వమేధ యాగాలు చేస్తే, శాశ్వత సుఖాలు, సకల శుభాలు ఇస్తాను అని అన్నాడు. ఆ రాజు అలాగే చేసి ఇంద్రానుగ్రహం పొందాడు. అందుకే ఈ నది కూడా దేవ నదిగా పిలువబడుతుంది. పుష్కర సమయాలలో ఈ నదీ స్నానం ఎంతో పుణ్యం ఉంటేగాని లభించదు.

## 10. భీమరథి లేక తామ్రపర్ణి:

తామ్రపర్ణి అనే పేరుతో మరొక నది కూడ ఉంది. భీమరథి సహ్య పర్వతము నుండి పుట్టింది. పూర్వం శివుడు త్రిపురాసుర సంహారం కోసం, దేవతలు ప్రార్థించగా, భూమిని రథంగా చేసుకుని, సూర్యచంద్రులు చక్రాలుగా చేసి, మేరు పర్వతాన్ని ధనుస్సుగా చేసుకొని, నాలుగు వేదాలు గుఱ్ఱాలుగా చేసి, వాసుకిని అల్లెత్రాడుగా చేసుకొని, శ్రీ మహావిష్ణువును బాణంగా మార్చి, బ్రహ్మ దేవుని సారథిగా చేసుకొని బయలుదేరి త్రిపురాసుర మూపురాలను తన శక్తితో ఒకచోటుకు చేర్చి, నారాయణాస్త్రంతో ధ్వంసం చేశాడు. ఆ సమయంలో స్వామి రథం భీమమై నడిచింది. ఆ రథ చక్రాలు భూమిని చీల్చిన చోట ఒక నది పుట్టింది. భీముడు అనే పేరు శివునికి ఉన్నది. భీమరథము అనగా శివుని యొక్క రథము అని ఒక అర్థము. భీమము అనగా భయంకరము అని ఒక అర్థము. భయంకరంగా నడిచిన శివుని రథం వలన ఆవిర్భవించింది

గాబట్టి ఈ నదికి భీమరథి అని పేరు వచ్చింది. ఇది తమిళనాడు లోని అంబాసముద్రము స్టేషనుకు దగ్గరగా ఉన్న బాణతీర్థం వద్ద ప్రముఖంగా జరుగుతుంది. మృత్యు దోషాలు ఉన్న వారు, గ్రహ పీడలు ఉన్న వారు పుష్కర
సమయంలో భీమనదీ స్నానం చేస్తే ఆ దోషాలు తొలగి పోతాయి.

## 11.తుంగభద్ర:

పూర్వము బ్రహ్మ యజ్ఞంలో నదీ రూపము ధరించిన సరస్వతిని, మహర్షులు, దక్షిణ భారతమును గూడ పవిత్రం చేయమని కోరారు. వారి కోరికపై అమ్మ సరస్వతి, తుంగభద్రా నదిగా మారి కర్ణాటకగుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్ లోని మంత్రాలయంలో కూడా ప్రవహించి, కృష్ణా నదిలో కలిసిపోయింది. సరస్వతీ నదికి ఎంత
ప్రాశస్త్యము ఉందో, తుంగభద్రకు కూడ అంత ప్రాశస్త్యము ఉంది. తెనాలి రామకృష్ణుడు ఈ నదిని గుణభద్రగా పేర్కొన్నాడు. ఈ నదీ తీరంలో చాలా పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది శృంగేరి శారదా పీఠము. ఇది శంకరాచార్యుల వారు, రాతిపై శ్రీచక్రాన్ని చెక్కించి దానిపై సువర్ణాదేవిని ప్రతిష్ఠించారు. పురాణాలలో ఈ సందర్భంగా ఒక విశేషమైన సూచన ఉంది. కాశీ గంగలో స్నానము చేసి, అక్కడ విశాలాక్షి
మాతను పూజించి, వెంటనే ఇక్కడకు వచ్చి తుంగభద్రలో నీరు త్రాగి శృంగేరి శారదా మాతను పూజిస్తే అనంత పుణ్యం లభిస్తుంది. అందుకే గంగా స్నానం, తుంగాపానం అనే గొప్ప సామెత కూడ ఏర్పడింది. ఈ తుంగభద్రకు దగ్గరలోనే మాల్యవంత పర్వతం ఉన్నది. ఇక్కడ సుగ్రీవ పట్టాభిషేకానంతరం రాముడు నాలుగు నెలలు ఉన్నాడు. తుంగ, భద్ర అనే ఈ రెండు నదుల కలయికయే తుంగభద్రా నది. సంగమేశ్వర్ అనే ప్రదేశంలో హరిహరులకు ప్రీతి పాత్రమైనది ఈ తుంగభద్రా నది. అందుకే తుంగభద్రా నదీ తీరంలో రావణగిరి వద్ద హరిహరులు వెలిశారు. చక్కని ఆలయం వారికి అక్కడ పురాణ కాలంలో నిర్మితమై ఉంది. తుంగభద్రా నది అలంపురం ప్రాంతంలో కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ అలంపురం జోగులాంబ అష్టాదశ పీఠాలలో ఒకటి. తుంగభద్రలో స్నానం చేస్తే మానవులలో పౌరుషం పెరుగుతుందని, సరస్వతీ నదికి మారురూపు కావటం వలన, చతుష్షష్టి కళలు లభిస్తాయని
పురాణేతిహాసాలు చెప్పుచున్నాయి. ఈ నదీ జలం విడువకుండా ఏడాది పాటు తాగి, యీ జలంతో పితృదేవతలకు తర్పణం ఇస్తే, ఆ వ్యక్తి సరస్వతీ స్వరూపుడౌతాడు. పుష్కర కాలంలో తుంగభద్రా స్నానం సకల పాప ప్రణాశనము. పుష్కర స్నానానంతరం విప్రోత్తములకు పురాణాలు దానం చేస్తే వారికి శాశ్వత బ్రహ్మ లోక నివాస సౌఖ్యాలు కలుగుతాయి. వస్త్ర దానం చేసిన వారికి ఉత్తమ జన్మలు కలుగుతాయి. సువర్ణం వంటి లోహాలు దానం చేస్తే మహారాజ యోగం వస్తుంది.

## 12. సింధు నది:

సింధు నది గంగా నదిలోని ఒక పాయ. పూర్వము భగీరథుని తపస్సుకు మెచ్చి, గంగ భూలోకానికి, శివుని శిరస్సు మీదుగా దిగి వచ్చింది. శివుడు తన జటాజూటంలోని గంగను, కొంచెంగా బిందు సరోవరంలో విడిచిపెట్టాడు. అక్కడనుండి గంగ ఏడు పాయలై

ప్రవహించింది. పావని, హ్లాదిని, నళిని అనే మూడు పాయలు తూర్పుగాను, సీత, సుచక్షువు, సింధువు అనే మూడు పాయలు పడమటగా ప్రవహించాయి. ఏడవ పాయ గంగగా భగీరథుని వెంట వెళ్లింది. ఈ విధంగా శివుని జటాజూటం నుండి పుట్టిన ఈ సింధు నది సాక్షాత్తు గంగా స్వరూపమే. ఈ నది రెండవ రూపం ధరించి వరుణుని సభలో ఉండి, ఆయనను ఉపాసిస్తుంది అని పురాణాలు చెప్తున్నాయి. ఈ నదికి పుష్పభద్ర అని మరియొక పేరు కూడ ఉంది. ఈ నదీ తీరంలో ఒకప్పుడు మార్కండేయ మహర్షి కఠోర దీక్షతో తపస్సు చేశాడు. ఆయన తపస్సును భగ్నం చేయటానికి ఇంద్రుడు ఎన్ని ప్రయత్నాలు చేసినా, తపస్సును విరమించ లేదు. చివరకు నరనారాయణులు ఆయనకు
ప్రత్యక్షమైనారు. అప్పుడు మార్కండేయుడు ఈ నదీ జలాలతో ఆ స్వామి పాదాలు కడిగాడు. ఆ నీరు తిరిగి నదిలో కలిసింది. విష్ణు పాదాల నుండి పుట్టిన గంగలో ఒక భాగమైన సింధు జలాలు తిరిగి ఆ స్వామి పాదాలే కడిగి, సింధూ నదీ జలాలలో కలిసి పోయింది. అందువల్లనే సింధు గంగ కంటే శ్రేష్ఠమైన నదిగా ప్రసిద్ధికెక్కింది. ఆ తరువాత మార్కండేయుడు మఱ్ఱి ఆకుపై శయనించిన శ్రీమన్నారాయణుని, ప్రపంచ ప్రళయ కాలమును దర్శనం చేసుకొన్నాడు. ఆ సమయంలో స్వామి  శరీరంలో సకల లోకాలు మార్కండేయుడు చూడగలిగాడు. హిమాలయ పర్వతంతో పాటుగా ఈ సింధు
నదిని గూడ స్వామిలో చూడగలిగాడు.  . దీనిని బట్టి సింధు ఎంత పవిత్రమైన నదియో తెలుతున్నది. ఈ నదిలో నుండి అగ్ని పుట్టింది. అందుకే ఈ నదిని అగ్ని ఉత్పత్తి స్థానంగా పేర్కొన్నారు. ఈ సింధు పేరు మీదుగానే భారతదేశానికి హిందూ దేశమని పేరు వచ్చింది. సింధు శబ్దాన్ని హిందూ అని పలకడం వల్ల ఈ పేరు వచ్చింది. ఈ సింధు నదీ తీరంలోని సామ్రాజ్యాన్ని సింధు దేశమని పిలిచేవారు. మహాభారత కాలంలో కౌరవుల చెల్లెలు దుస్సల భర్త జయద్రదుడు ఈ సింధు దేశపు రాజే. అందుకే అతనిని
సైంధవుడు అని కూడ అంటారు. ఇంతటి పవిత్ర నది 1947లో భారతదేశము విభజించబడినప్పుడు, పాకిస్థాన్ లోకి వెళ్లి పోయింది. అందువల్ల పుష్కర స్నానం చెయ్యడానికి, అవకాశం లేని దానికి పెద్దలు మార్గాంతరాన్ని సూచించారు. దాని ప్రకారము, కాశీకి గాని, హరిద్వార్ గాని వెళ్లి గంగా నదిలో, సింధు నదీ
పుష్కర సంకల్పం చెప్పుకొని స్నానం చేస్తే, సింధుగూడ గంగ లోని ఒక పాయే గాబట్టి ఆ పుణ్యం వారికి
లభిస్తుంది.